క్లుప్తంగా

నేడు 'అన్నా' ప్రచారం

కొనకనమిట్ల: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సాయంత్రం మార్కాపురం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి అన్నా రాంబాబు మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టనున్నట్లు మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి తెలిపారు. వెలిగండ్ల, ముసలాయపల్లి, మునగపాడు, బసాపురం, మువ్మాయపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే అన్నా ప్రజలను కలిసి సంక్షేమ లబ్ధిని వివరిస్తారని తెలిపారు. పార్టీ శ్రేణులు హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

వరాల కొండ 'వెలుగొండ'

కొనకనమిట్ల: శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నేటి నుంచి మూడు రోజుల పాటు జరిగే తిరునాళ్లకు ప్రముఖ పుణ్యక్షేత్రం వెలుగొండ క్షేత్రం ముస్తాబైంది. ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ త్రయోదశి మొదలు బహుళ ఏకాదశి వరకు బ్రహ్మాండ నాయకునికి బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహిస్తారు. ఆదివారం గరుడోత్సవం, సోమవారం గజోత్సవం, తిరునాళ్ల సందర్భంగా ఎడ్ల పోటీలు, రాత్రికి పౌరాణిక నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. మంగళవారం రథోత్సవం జరగనుంది. మూడు రోజుల పాటు జరిగే తిరునాళ్ల సందర్భంగా అన్ని కులాలకు సంబంధించిన అన్నదాన సత్రాల్లో భక్తులకు అన్నదానం చేయనున్నారు. సోమ, మంగళవారాల్లో రాష్ట్ర స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహిస్తారు.

ఉత్సవ ఉభయదాతులుగా తాడి తిరుపతిరెడ్డి, చినసుబ్బా రెడ్డి, గాలిరెడ్డి, కొండారెడ్డి దంపతులు వ్యవహరించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి, చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి పర్యవేక్షణలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం గరుడోత్సవ ఉత్సవం, ఎడ్లపందేలు జరుగుతాయని ఆలయ మేనేజరు చెన్నకేశవరెడ్డి, చైర్మన్ తిరుపతిరెడ్డి తెలిపారు.

ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలి

బేస్తవారిపేట: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ నిర్భయంగా, స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని ఎస్సై నరసింహారావు అన్నారు. శనివారం మండలంలోని జెన్నివారిపల్లె, గంటాపురం గ్రామాల్లో ఎన్నికలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎవరైనా బెదిరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అసాంఘిక కార్యక్రమాలకు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జగనన్న కోసం వలంటీర్ రాజీనామా

ముండ్లమూరు: జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయడం కోసం వలంటీర్ తన రాజీనామా పత్రాన్ని ఎంపీడీఓ శంకరరావుకు శనివారం అందజేశారు. మండలంలోని నూజిళ్లపల్లి సచివాలయం పరిధి తూర్పుకంభంపాడు గ్రామానికి చెందిన 17వ క్లస్టర్ వలంటీర్ మూసం నారాయణస్వామి తన రాజీనామ పత్రాన్ని ఎంపీడీఓకు అందజేశారు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలనే ఆలోచన ఉండటంతో అధికారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్లు నారాయణస్వామి తెలిపారు.

3,4 తేదీల్లో జాతీయ స్థాయి టెక్నో ఫెస్ట్



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న విశాల్, కళాశాల సిబ్బంది

మార్కాపురం: మార్కాపురంలోని డాక్టర్ సామ్యేల్ జార్జ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏప్రిల్ 3,4 తేదీల్లో జాతీయ స్థాయి టెక్నో కల్చరర్ ఫెస్ట్ ఏమర్జ్ 2024 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల కార్యదర్శి ఆదిమూలపు విశాల్ తెలిపారు. శనివారం కళాశాలలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. 18వ జాతీయ స్థాయి టెక్నో ఫెస్ట్ సందర్భంగా ఉభయ రాష్ట్రాల నుంచి ఇంజినీరింగ్ కళాశాల ప్రతినిధులు హాజరై పేపర్ ప్రెజెంటేషన్, జాతీయ సంస్కృతిని ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కన్వీనర్లుగా డాక్టర్ పి. సాధూ నాయక్, వైవీ సత్యనారాయణ వ్యవహరిస్తారని ప్రసాద్ డాక్టర్ రాజబాబు తెలిపారు. డీన్ మస్తానయ్య పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

పెద్దదోర్నాల: మండల పరిధిలోని కడపరాజుపల్లెలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి, భక్త సిద్ధప్ప నూతన విగ్రహ, శిఖర, కలశ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ శనివారంతో ముగిశాయి. గ్రామ ప్రజలు అంగరంగ వైభవంగా సంబరాలు చేసుకున్నారు. కాకర్ల శ్రీనివాసులుశర్మ, బ్రహ్మశ్రీ ఓరుగంటి సీతారామశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

బాధితులకు నిత్యావసరాలు

బేస్తవారిపేట: మండలంలోని చెన్నుపల్లె అగ్నిప్రమాదంలో పూర్తిగా పూరిపాకలు దగ్ధమవడంతో రెండు కుటుంబాలకు నిత్యావసరాలు మాజీ ఎంపీటీసీ సభ్యుడు దప్పిలి సంభూతరెడ్డి శనివారం పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, నూనే, ఇతర నిత్యావసర సరుకులు అందచేశారు. బాధిత కుటుంబాలను దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలని ఈ సందర్భంగా పలువురు నాయకులు కోరారు.

పేదలకు అండగా వైఎస్సార్ సీపీ జెండా

● డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి



ప్రత్యేక పూజల్లో డాక్టర్ శివప్రసాదరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ

ముండ్లమూరు: పేద, బడుగు బలహీన వర్గాల వారికి వైఎస్సార్ సీపీ జెండా అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ దర్శి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక తాళ్లూరు రోడ్‌లో వైఎస్సార్ సీపీ మండల నూతన కార్యాలయాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నందినిలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కోసం కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. పార్టీ అభివృద్ధే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేస్తే రానున్న రోజుల్లో మంచి గుర్తింపుతో పాటు సముచిత స్థానం ఉంటుందని చెప్పారు. అన్ని వర్గాల్లోని పేదలకు మన ప్రభుత్వంలోనే భరోసా లభిస్తోందన్నారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవడం మనందరి బాధ్యతన్నారు. అందుకోసం ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరూ కలిసి పని చేయాలన్నారు. ఎవరికి ఎలాంటి అవసరం వచ్చినా 24 గంటలూ బూచేపల్లి ఇంటి తలుపులు తెరిచే ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం గ్రామాల వారీగా నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలతో పూజా కార్యక్రమం నిర్వహించి నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. దివంగత నేతలు వైఎస్సార్, బూచేపల్లి సుబ్బారెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూదిదేవర అంజయ్య కుటుంబ సభ్యులు గజమాలతో బూచేపల్లి కుటుంబ సభ్యులను సన్మానించారు. మండల ఇన్‌చార్జ్‌లు వెంకటరత్నం, కాపా నరసింహారెడ్డి, కాపా రమణారెడ్డి, ఎంపీపీ సుంకర సునీతాబ్రహ్మారెడ్డి, జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, మండల జేసీఎస్ కన్వీనర్ మేడికొండ జయంతి, వైస్ ఎంపీపీలు బంకా రమణమ్మ నాగిరెడ్డి, వేముల పద్మావతి జానకిరామయ్య, సర్పంచ్‌ల సంఘ మండల మాజీ అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల వెంకటేశ్వరరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా సెక్రటరీ కుంటా అచ్చారావు, నాయకులు మేదరమెట్ల కోదండరామయ్య, బిజ్జం కృష్ణారెడ్డి, యరబ్రోలు శ్రీనివాసరెడ్డి, మేడగం రమణారెడ్డి, పాలడుగు చిరంజీవి, బేతపూడి పేరయ్య చౌదరి, గూడాల లింగారెడ్డి, భిక్షాలురెడ్డి, అప్పిరెడ్డి, కొండారెడ్డి, అంజిరెడ్డి, గర్నెపూడి జాన్, కంభంపాటి నాగేశ్వరరావు, తాళ్ల ఇంద్రసేనారెడ్డి, ఎనుముల శ్రీనివాసరెడ్డి, తాతపూడి శాంతకుమార్, గండి సురేష్, దానియేలు, మధు, దుగ్గినేని వెంకట్, సర్పంచ్‌లు వేముల పద్మశ్రీనివాసరావు, వంగల పద్మావతి శ్రీనివాసరెడ్డి, కందిమళ్ల గీతాంజలి, జమ్ముల గురవయ్య, ఎంపీటీసీలు తేలుకుట్ల బ్రహ్మం, గుణపాటి వెంకటేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కార్యకర్తలతో చెవిరెడ్డి ఆత్మీయ సమావేశం రేపు



సమావేశం ఏర్పాటు చేయనున్న కాలేజీని పరిశీలిస్తున్న చెవిరెడ్డి, నాయకులు

పొదిలి రూరల్: వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పొదిలిలో సోమవారం కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశం నిర్వహించడానికి మండలంలోని మాదాలవారిపాలెం సమీపంలో ఉన్న ఓ ప్రయివేటు కళాశాలను ఆయన శనివారం పరిశీలించారు. ముందుగా విశ్వనాథపురంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బీఎల్ఎన్ గ్రాండ్‌లో నాయకులతో చర్చించారు. అంతకు ముందు జూనియర్ కాలేజీ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన వన్ స్టాప్ కేఫ్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కేవీ రమణారెడ్డి, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, పంచాయతీ రాజ్ విభాగం కార్యదర్శి కల్లం సుబ్బారెడ్డి, సేవదళ్ అధ్యక్షుడు గుజ్జుల సంజీవరెడ్డి, వాణిజ్య విభాగం కార్యదర్శి యక్కలి శేషగిరి,ముల్లా జాకీర్, మోరా శంకర్ రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, పిచ్చిరెడ్డి తదితరులున్నారు.

దానధర్మాలకు ప్రతీక రంజాన్

● ఎమ్మెల్యే అన్నా రాంబాబు



ఇఫ్తార్ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే అన్నా రాంబాబు, పార్టీ నాయకులు

మార్కాపురం: దాన ధర్మాలకు ప్రతీక రంజాన్ మాసమని వైఎస్సార్ సీపీ మార్కాపురం అభ్యర్థి ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. శుక్రవారం రాత్రి మార్కాపురం పట్టణంలో ప్రముఖ సామాజిక ఉద్యమకారులు నజీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఎమ్మెల్యే రాంబాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఉపవాసదీక్షలో ఉన్న ముస్లిం సోదరులకు అభినందనలు తెలిపి అల్లా బోధనలు ఆచరించాలన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తోటివారి పట్ల ప్రేమ, దయ, దాతృత్వము కలిగి ఉండాలని సూచించారు. మానవాళిహితం కోసం రంజాన్ మాసమంతా చేసే ఉపవాసాలు దాన ధర్మాలు చేయడం ప్రసంశనీయమన్నారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్, మున్సిపల్ చైర్మన్ బాలమురళీ కృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, యార్డు డైరెక్టర్‌లు పీఎల్‌పీ యాదవ్, డాక్టర్ మగ్బుల్‌బాషా, కోఆప్షన్ సభ్యులు అమీరుల్లా ఖాన్, పార్టీ నాయకులు ఎస్‌కే ఉస్మాన్, షెక్షావలి, కరీంబాషా, కౌసర్ మసీదు ముతవలి షేక్ ఖాశీం సన్మానించారు.

అన్నాను అత్యధిక మెజారిటీతో గెలిపించండి



ఇడుపూరులో మాట్లాడుతున్న జంకె

మార్కాపురం రూరల్: వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే అన్నా రాంబాబు, పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఏపీ ఐబీసీ చైర్మన్ జంకె వెంకటరెడ్డి గ్రామస్తులను కోరారు. మండలంలోని ఇడుపూరులో నాయకులు, గ్రామస్తులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, అభివృద్ధి జరగాలన్నా 2024లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని తెలిపారు. గ్రామంలో నాయకుల మధ్య ఏవైనా మనస్పర్థలుంటే సర్దుకుని పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఆయన వెంట వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, గొలమారి శివారెడ్డి, సీహెచ్ రమణారెడ్డి, వెన్న మహేశ్వరి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పోలేపల్లిలో ఇంటింటా ప్రచారం



ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

దొనకొండ: మండలంలోని పోలేపల్లిలో జేసీఎస్ కన్వీనర్ గుంటు పోలయ్య ఆధ్వర్యంలో కార్యకర్తలు శనివారం ఇంటింటా ప్రచారం చేశారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమానికి, అభివృద్ధికి ఓటు వేయండి అంటూ ఓటర్లను కోరారు. దర్శి ఎమ్మెల్యే అభ్యర్థి బూచేపల్లి శివప్రసాదరెడ్డి, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డికి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించుకోవాలని, అలాగే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఓటర్లను పేరుపేరునా కోరారు.

సచివాలయాలతో ఇళ్ల వద్దకే పాలన




తర్లుపాడులో ప్రచారం చేస్తున్న కృష్ణ చైతన్య

తర్లుపాడు: సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటివద్దకే పాలన అందించినట్లు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు తనయుడు కృష్ణచైతన్య అన్నారు. తర్లుపాడులో ఆయన రెండో రోజు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ జగనన్న ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. కరపత్రాలు అందించి ఎమ్మెల్యే అభ్యర్థిగా తన తండ్రి అన్నా రాంబాబు, ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాల్సిందిగా ప్రజలను కోరారు. ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ ఇందిర హనుమా రెడ్డి, పార్టీ అధ్యక్షులు మురారి, స్థానిక సర్పంచ్ వరాలు, వైస్ సర్పంచ్ సత్యనారాయణ రెడ్డి, ఎంపీటీసీ అంకమ్మ, కోఆప్షన్ సభ్యులు అక్బర్ అలీ, సొసైటీ చైర్మన్ రామిరెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ కె. సత్యనారాయణరెడ్డి, మల్లారెడ్డి, మందా కొండారెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, కొలగట్ల రామకృష్ణారెడ్డి, ఎబినేజర్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

చెన్నుపల్లెలో రెండు పూరిళ్లు దగ్ధం



ఆదిలక్ష్మమ్మ పూరిల్లు



మంటల్లో కాలిపోయిన మోటార్ సైకిల్

బేస్తవారిపేట: మండలంలోని చెన్నుపల్లెలో అగ్నిప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధమైన సంఘటన శనివారం జరిగింది. గ్రామానికి చెందిన కొండమల్ల ఆదిలక్ష్మమ్మ కూలీపనులకు వెళ్లిన అనంతరం మధ్యాహ్నం వంట చేసుకుంది. పూరిగుడిసె బయటకు వచ్చి అన్నం తింటున్న సమయంలో నిప్పురవ్వలు చెలరేగి పూరి గుడిసెకు అంటుకున్నాయి. ఈదురుగాలులకు ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో ఇంట్లోని గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. బీరువాలోని రూ.50 వేలు నగదు, కమ్మలు, నక్లెస్ అగ్నికి ఆహుతయ్యాయి. ఇంటి పక్కనే ఉన్న కొండమల్లు లింగయ్యకు చెందిన పూరి గుడిసెకు మంటలు అంటుకుని ఎగిసిపడుతుండటంతో వరండాలో కట్టేసిన ఎద్దులను విడిపించారు. ఇంట్లోకి వెళ్లే పరిస్థితి లేకపోవడంతో బీరువాలోని బంగారు ఉంగరాలు, సరుడు, నెక్లెస్, వెండి గొలుసులు దగ్ధమయ్యాయి. నిప్పురవ్వలు చెలరేగి లింగయ్య ఇంటికి సమీపంలోని పెద్దమల్లు తిరుమలయ్య రేకుల షెడ్డుకు నిప్పు అంటుకుంది. షెడ్డు ఆవరణలో ఉన్న మోటార్ సైకిల్ అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. సమాచారం అందుకున్న కంభం అగ్ని మాపకదళ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఎస్సై నరసింహారావు, వీఆర్వోలు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.